వరి కోతలు షురూ!

4.43 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

వానాకాలం సీజన్‌లో ఆటుపోట్లను తట్టుకుంటూ వ్యవసాయం చేసిన అన్నదాతలు వరి కోతలకు శ్రీకారం చుట్టారు. ఇప్పటికే కొన్ని చోట్ల ప్రారంభించారు. పంట ఏపుగా పెరగడం, ఆరోగ్యంగా ఉండటంతో దిగుబడిపై భారీ ఆశలు పెట్టుకున్నారు. సాగునీరు అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో వరి పంటను రైతులు సీజన్ ప్రారంభంలోనే సాగు చేశారు. వరి పంట చేతికందుతుండగా వర్షాలు విరామమివ్వడంతో కోతలను ఆరంభించారు.

జిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, వెంకటాపూర్, ముస్తాబాద్ మండలం ఆవునూరు, గూడెం తదితర గ్రామాలతోపాటు గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, రుద్రంగి తదితర మండలాల్లో వరికోతలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి.

☛ జిల్లాలో సుమారు 4.43 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు.

☛ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ సంబంధిత శాఖల అధికారులతో ఇటీవల సమీక్షాసమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు.

☛ జిల్లాలోని 13 మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతుంది.

258 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

వరి పంట కాలం పూర్తవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం ధాన్యం సేకరణకు జిల్లాలో పీపీసీఎస్ ఆధ్వర్యంలో 202, ఐకేపీ పరిధిలో 44, మిగతా శాఖల కింద 12 కలుపుకొని మొత్తం 258 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తమవుతున్నారు.


వెంకటాపూర్ శివారులో వరిని కోస్తున్న యంత్రం

☛ జిల్లా మొత్తంగా ధాన్యం దిగుబడిలో 3 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు కేంద్రాలకు రానుందని అంచనా వేశారు. అవసరమైతే కొనుగోలు కేంద్రాల సంఖ్యను పెంచాలని భావిస్తున్నారు.

☛ కేంద్రాల ఏర్పాటుతోపాటు వాటిలో కనీస సౌకర్యాల కల్పనపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. 7,777 టార్పాలిన్లు, 766 తూకం వేసే యంత్రాలు, 634 ప్యాడీ క్లీనర్లు, 603 తేమ శాతం చూసే యంత్రాలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి.

☛ తాలు, తప్ప లేకుండా ధాన్యాన్ని శుద్ధి చేసి, తేమశాతం 17 ఉండేలా చూసుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచిస్తున్నారు.

జిల్లాలో రైతుబంధు లెక్కల ప్రకారం 1,34,725 మంది రైతులున్నారు. వానాకాలం సీజన్‌లో ప్రధాన పంటగా వరిని 1,79,672 ఎకరాల్లో సాగు చేశారు. అందులో 13,552 ఎకరాల్లో సన్నరకం, 1,66,123 ఎకరాల్లో దొడ్డు రకాలున్నాయి.

13,552 ఎకరాల్లో సన్నరకం సాగు

☛ సన్నరకం వరికి రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ప్రకటించడంతో రైతులకు కొంత మేర ఊరట లభించనుంది.

☛ సన్న రకాలు ఎకరానికి 18 నుంచి 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని భావిస్తుండగా, జిల్లాలో మొత్తం దాదాపు 28,457 క్వింటాళ్లు వస్తుందని అంచనా వేశారు.

☛ దొడ్డు రకం ఎకరానికి 25 క్వింటాళ్ల చొప్పున లెక్కిస్తే సుమారు 4,15,307 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

☛ జిల్లాలోని పలు మండలాల్లో వరి పంట కోత దశకు చేరుకోగా, కొన్ని మండలాల్లో ఈనే దశలో ఉంది. మరికొద్ది రోజుల్లో వరి కోతలు ముమ్మరం కానున్నాయి.

☛ ప్రస్తుతం కోతలను ప్రారంభించిన కర్షకులు కొంత మంది అకాల వర్షాల భయంతో ధాన్యాన్ని నేరుగా రైస్‌మిల్లులకు తరలిస్తుండగా మరికొందరు కొనుగోలు కేంద్రాలకు చేరవేస్తున్నారు.


పరిశీలిస్తున్న అధికారులు

ధ్రువపత్రాల పరిశీలన

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1:3 నిష్పత్తిలో ఎంపికైన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన రెండో రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా గురువారం 167 మంది అభ్యర్థులకు చెందినవి పరిశీలించారు. ఇప్పటి వరకు 241 మందివి పూర్తయినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. ఇంకా 137 మందివి పరిశీలించాల్సి ఉందని, ఈ నెల 5 వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు.

27.19 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ

బోయినపల్లి, న్యూస్‌టుడే: రాజరాజేశ్వర జలాశయం పూర్తి సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 27.19 టీఎంసీలకు చేరింది. జలాశయానికి వరద లేదు. జలాశయం నుంచి నీటి విడుదలను అధికారులు నిలిపివేశారు. మిషన్ భగీరథకు 190 క్యూసెక్కుల నీరు వెళ్తుంది.

స్కీంల పేరుతో మోసం!

జిల్లాలో కూపన్‌లు, లక్కీ డ్రాలతో నయా దందా



☛ జిల్లాలో మూడేళ్ల క్రితం ఒక సంస్థ ఒకే సారి రూ.30 వేలు చెల్లిస్తే ఆరు నెలల తర్వాత నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం లక్ష రూపాయలు మీ సొంతం చేసుకోవచ్చని భారీగా డబ్బులు వసూలు చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని చాలా గ్రామాల్లో చాప కింద నీరులా వ్యాపించింది. డబ్బులు చెల్లించే సమయానికి రేపుమాపు అంటూ కాలం వెళ్లదీశారు. చివరికి తాము మోసపోయామని గ్రహించి పోలీసులను ఆశ్రయించారు. వారిపై కేసులు నమోదైనా కట్టిన డబ్బులు మాత్రం రాలేదు.

☛ రూ.5 లక్షలకు రెండు పడక గదుల ఇల్లు నిర్మించి ఇస్తామని ఓ స్వచ్ఛంద సంస్థ గ్రామాల్లో ప్రచారం చేసింది. ముస్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వీరి మాటలు నమ్మి చాలా మంది డబ్బులు కట్టారు. కొన్ని చోట్ల నిర్మాణాలు కూడా ప్రారంభించారు. దీంతో కొందరైతే పాత ఇళ్లను కూల్చివేసుకుని కొత్త ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. కొన్ని నెలలకు సంస్థ నిర్వాహకులు, వారి కింద పని చేసేవారు గ్రామం విడిచి వెళ్లారు. రూ.లక్షల్లో డబ్బులు చెల్లించిన వారు లబోదిబోమంటూ మధ్యవర్తులను ఆశ్రయించారు. వారు కూడా చేతులెత్తేయడంతో పలువురు ఆత్మహత్యకు యత్నించారు. దీనిపై పోలీసులు విచారణ జరిపి సంస్థ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు.

ఈనాడు, సిరిసిల్ల

జిల్లాలో మధ్య తరగతి కుటుంబాలే లక్ష్యంగా దసరా, దీపావళి పండగల పేరున స్కీంలకు రూపకల్పన చేశారు. కష్టపడి కూడబెట్టుకున్న సొమ్మును కొట్టేసేందుకు కేటుగాళ్లు పన్నాగం పన్నుతున్నారు.

● వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో దసరా ధమాక పేరుతో 'రూ.100 కొట్టు మేకను పట్టు' అంటూ జిల్లా ప్రజలకు బంపర్ ఆఫర్ స్కీంను రూపొందించామని ప్రచారం చేసుకున్నారు. మరొకరు రూ.100లతో ఒక కూపన్ కొంటే మద్యం, కోడి, మేకలను లక్కీ డ్రాలో గెలుచుకోవచ్చంటూ పథకాన్ని తీసుకొచ్చారు. వీటిని సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు.

● సిరిసిల్ల, వేములవాడ పట్టణాల్లోని వ్యాపార కేంద్రాల్లో విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు. నెల రోజుల క్రితం వేములవాడ పట్టణంలో వాహన, గృహోపకరణాల కొనుగోలుకు నెల వారీ వాయిదాలతో భాగస్వాములు కావాలని బ్రోచర్ ద్వారా ప్రచారం చేశారు. చేరిన వారికి ఏడాదిలో లక్కీ డ్రా తీసి వారి పేరు తగిలితే నగదు, పలు రకాల వస్తువులు అందిస్తామని అందులో పేర్కొన్నారు.

● ఇలాంటి ప్రచారాలు ఎక్కువ కావడంతో పోలీసులు దృష్టి సారించారు. వేములవాడ పోలీసు సబ్ డివిజన్‌లో కొడుముంజ, వేములవాడ పట్టణాల్లో స్కీంలు, లక్కీ డ్రాల ప్రచారంతో మోసాలకు పాల్పడుతున్న పది మందిపై బుధవారం కేసులు నమోదు చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

లాటరీలు, స్కీంలు నడిపేవారు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో అలాంటివేమీ లేవు. ప్రజలను మోసం చేస్తూ ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా ఇలాంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలి.

- అఖిల్ మహాజన్, ఎస్పీ

వైభవంగా దేవీ నవరాత్రోత్సవాలు


అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న ఈవో వినోద్‌రెడ్డి, అర్చకులు

వేములవాడ, న్యూస్‌టుడే: దక్షిణ కాశీగా పేరొందిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో గురువారం దేవీ నవరాత్రోత్సవాలు వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలకు ఆలయాన్ని విద్యుత్తు దీపాలు, అరటి, మామిడి, పూల తోరణాలతో అలంకరించారు. ఆలయంలో ఉదయం స్వస్తి పుణ్యవచనం, అంకురార్పణ, కలశ స్థాపన, కలశ ప్రతిష్ఠ, గాయత్రి హవనం తదితర పూజా కార్యక్రమాలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలు, శ్రీరాజరాజేశ్వరి అమ్మవారికి లలితా సహస్రనామ సహిత చతుష్షష్టి పూజలను వేద మంత్రాలతో వైభవంగా జరిపారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

చెరువు గట్టు కాదు... రోడ్డు రక్షణ కట్ట



ఈ చిత్రంలో కనిపిస్తున్నది చెరువు గట్టు అనుకుంటే పొరపాటు పడినట్లే. రుద్రంగి మండల కేంద్రంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారి అంచుల్లో నిర్మించిన రాళ్ల కట్ట. ఇటీవల నిర్మించిన ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి సుమారు మీటరు మేర ఎత్తు పెరగడంతో అంచుల్లో భారీ వాలు ఏర్పడింది. వర్షాలు కురిసినప్పుడు రోడ్డు అంచుల్లో కోత ఏర్పడకుండా దీనిని నిర్మించారు. అయితే భారీ వర్షాలకు ఇది కూడా అక్కడక్కడ కోతకు గురవుతుంది. **- న్యూస్‌టుడే, రుద్రంగి**

9న విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

బోయినపల్లి, న్యూస్‌టుడే: సెస్ వేములవాడ సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 9న చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో విద్యుత్తు వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏఈ ప్రశాంత్ తెలిపారు. వినియోదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాల సందర్భంగా గురువారం స్త్రీ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలోని వయోవృద్ధుల ఆశ్రమాల్లో చదరంగం, క్యారం, లూడో ఆటల పరికరాలు, డీటీహెచ్ సేవలు అందుబాటులో ఉంచామని తెలిపారు. వారిని తీర్థ, విహార యాత్రలు, సినిమాలకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలోని రెండు ప్రభుత్వ, నాలుగు ప్రైవేట్ ఆశ్రమాలలో 136 మంది వృద్ధులు ఉన్నారని తెలిపారు. వృద్ధులు తమ పేరిట ఉన్న ఆస్తి, ఇతరాలు మొత్తం పిల్లలకు ఇవ్వకూడదని, తమ వద్ద కూడా కొంచెం ఉంచుకోవాలని సూచించారు. వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిన టోల్ ఫ్రీ నంబరు 14567ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులు, పోలీసులు, వైద్యాధికారులను సంప్రదించాలని పేర్కొన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని పేర్కొన్నారు. అనంతరం వృద్ధాశ్రమాల బాధ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, అదనపు ఎస్పీ చంద్రయ్య, జిల్లా వైద్యాధికారి వసంతరావు, వివిధ శాఖల అధికారులు, ఆశ్రమాల బాధ్యులు పాల్గొన్నారు.


వృద్ధాశ్రమ బాధ్యుడిని సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సీడీపీ పనుల పూర్తికి ఆదేశం

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సీడీపీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో సీడీపీ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి ప్రోగ్రాం (సీడీపీ) నిధులకు సంబంధించి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు మంజూరు చేసిన పనులను పంచాయతీరాజ్, ఇంజినీరింగ్, మిషన్ భగీరథ, విద్యాశాఖ, మున్సిపల్ తదితర 18 శాఖలకు కేటాయించినట్లు పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో పనులు పూర్తయినప్పటికీ యూసీలు సమర్పించకపోవడం వల్ల ప్రభుత్వ రికార్డుల్లో పనులు పూర్తి కానట్లు ఉందని చెప్పారు. పూర్తి చేసిన వాటికి సంబంధించి యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిపై సంబంధిత శాఖలు నివేదిక సమర్పించాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు మొదలు పెట్టని పనులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీల నుంచి తీర్మానాలు తీసుకొని వెంటనే మొదలు పెట్టాలని సూచించారు. ఈ సమావేశంలో సీపీవో శ్రీనివాసచారి, పీఆర్ ఈఈ భూమేశ్, ఇంజినీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత.. సృజనాత్మకత





న్యూస్‌టుడే, కరీంనగర్ కొత్తపల్లి

వాహన చోదకుడు నిద్ర పోకుండా అలారంతో అప్రమత్తం చేసే కళ్లజోడు.. మట్టిలోని తేమ తగ్గితే మోటారును ఆన్ చేసి నీరందించే మోటారు.. భూగర్భ గనుల్లో విషవాయువులను గుర్తించి కార్మికులను హెచ్చరించే హెల్మెట్.. విద్యుదాఘాతం, విద్యుత్తు వృథాను తగ్గించే నీటి హీటర్.. ఇలా ఎన్నో సాంకేతిక పరికరాల తయారీకి విద్యార్థులు, యువతీ యువకులు మేధస్సుకు పదును పెట్టారు. ప్రజా సమస్యలకు తమవంతుగా పరిష్కారం చూపుతూ సృజనాత్మకత చాటారు. జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో యువజనోత్సవాల్లో భాగంగా ఇటీవల కరీంనగర్ పురాతన ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాలో ప్రాజెక్టులను ప్రదర్శించిన విద్యార్థులపై 'న్యూస్‌టుడే' కథనం.

1 ప్రదర్శన పేరు 2 భాగస్వాములైన విద్యార్థులు 3 కళాశాల/పాఠశాల 4 పని చేసే విధానం 5 ఉపయోగం

రైతు కష్టాన్ని తగ్గించి.. ప్రమాదాలు దూరం



1 ఆటోమేటిక్ తేమ డిటెక్టివ్ మోటార్
2 నక్షత్ర, ఆర్.జ్యోత్స్న, కె.వర్షిత ప్రియ
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 తేమ సెన్సార్‌ను భూమిలో పాతిపెట్టి డివైస్‌ను ఏర్పాటు చేయాలి. పంట పొలాల్లో తేమ తగ్గితే వెంటనే మోటార్‌ను ఆన్ చేసి సరిపడిన నీరు అందించి.. తర్వాత మోటార్‌ను ఆఫ్ చేస్తుంది.
5 రైతులకు విద్యుదాఘాతం నుంచి రక్షణతోపాటు శ్రమ తగ్గుతుంది. సకాలంలో పంటకు నీరు అందించడంతో దిగుబడి పెరుగుతుంది. రైతు పంట పొలానికి వెళ్లాల్సిన అవసరం లేదు. నీరు వృథా కాదు.

స్విచ్ వేయకుండానే తిరిగే పంకాలు, వెలిగే లైట్లు



1 ఆటోమేటిక్ పరికరాలు 2 జి.అఖిల, ఎ.శ్రీనిత్య
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 ఇంట్లో ఫ్యాన్లు, దీపాలు, సంప్ మోటారు ఎలక్ట్రానిక్ వస్తువులకు ఈ పరికరాన్ని అనుసంధానం చేయాలి. చేతితో ముట్టుకోకుండా అరచేతులు కొట్టినా, మాట వినిపించినా వస్తువులన్నీ ఆన్ అవుతాయి.. వద్దనుకుంటే ఆఫ్ అవుతాయి.
5 విద్యుదాఘాతం నుంచి రక్షణ, ఇంట్లో మహిళలు, వృద్ధులకు అనుకూలమైంది. విద్యుత్తు ఆదా. . శ్రమ తగ్గుతుంది.

డ్రైవర్ నిద్రపోకుండా.. అప్రమత్తం చేసేలా..



1 డ్రైవర్‌ను మేల్కొల్పే అలారం 2 పి.సాహితి, ఎం.అఖిల
3 తిమ్మాపూర్ వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాల
4 నిద్రలేకనో, అలసిపోయో డ్రైవర్లు నిద్రలోకి జారుకుంటే (మూడు సెకన్ల కంటే ఎక్కువ సమయం దాటితే) కళ్లద్దాలు గుర్తించి అలారం మోగి.. డ్రైవర్లను అప్రమత్తం చేస్తాయి. అంతటితో ఆగకుండా ఇంజిన్ వద్ద ఉన్న డివైస్ వాహన వేగాన్ని తగ్గిస్తుంది.
5 రోడ్డు ప్రమాదాల నివారణ. ప్రాణాలకు రక్షణ

గని కార్మికులకు రక్షణ..




1 మైనింగ్ సేఫ్టీ క్యాప్
2 ఎం.జాహ్నవి, జి.భావన
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 గనుల్లో పని చేస్తుండగా విషవాయువులు బయటకు వస్తున్నప్పుడు కార్మికులు ఈ క్యాప్‌ను ధరించి ఉంటే ప్రమాదం నుంచి బయటపడొచ్చు.
5 అలారం మోగిన వెంటనే కార్మికుడు అప్రమత్తమై మాస్కులు, ఆక్సిజన్ ధరిస్తే ఆరోగ్య సమస్యలకు దూరంగా ఉండవచ్చు.

ప్రమాద రహిత వేడి నీటి యంత్రం



1 అధునాతన హీటర్
2 యు.శృతి, బి.చరణ్
3 కరీంనగర్ డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
4 హీటర్‌కు పరికరాలను అమర్చి.. నీటిలో ఉంచినప్పుడు సెన్సార్లు లవణాలను (గ్రహించి) విద్యుత్తు ప్రవహించి వేడిగా ఉత్పత్తి అవుతుంది. దానిని బయటకు తీస్తే సెన్సార్లకు లవణాలు అందకపోవడంతో కరెంటు సరఫరా నిలిచిపోతుంది.
5 ఇంట్లో పిల్లలు, మహిళలు విద్యుదాఘాతం బారిన పడకుండా చూసుకోవచ్చు. ప్రమాదాలు, ఆస్తి నష్టం జరగదు.

భూమిలో కరిగే సంచి



ఎకో లాస్టిక్ సంచులలో పెంచిన మొక్కలు



నేను ప్లాస్టిక్ కాను అని రాసి ఉన్న సంచి

రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం తగ్గించడానికి ప్రత్యామ్నాయంగా వినియోగించుకునేలా నగరపాలక సంస్థ అడుగులేస్తోంది. నర్సరీల్లో ఏటా లక్షల్లో మొక్కలు నాటేందుకు విత్తనాలు వేసి మొక్కలు పెంచడానికి ఉపయోగించే ప్లాస్టిక్ సంచులకు బదులుగా ఎకో లాస్టిక్ బ్యాగులు వినియోగంలోకి తెచ్చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆలోచన విధానాలకు అనుగుణంగా మేయర్ సునీల్‌రావు, అప్పటి కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ చొరవతో భూమిలో కరిగి పోయే బ్యాగులను వాడేందుకు మొగ్గు చూపారు. పద్మనగర్ సమీపంలోని బుల్ సెమన్ సెంటర్‌లోని నర్సరీలో 20 వేల సంచులలో మొక్కలు నాటారు. వీటిని ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. ఈ సంచి నాలుగు నెలల్లోనే భూమిలో కరిగిపోయి ఎరువుగా మారుతోందని నగర పాలక ఇంజినీరింగ్ అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, కరీంనగర్ సుభాష్‌నగర్

కొత్తపత్తి గరిష్ఠ ధర రూ.6,900

జమ్మికుంట, న్యూస్‌టుడే: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 18 ట్రాలీల కొత్త పత్తిని రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. బిడ్డింగ్‌లో క్వింటాకు కనిష్ఠంగా రూ.6,000 గరిష్ఠంగా రూ.6,900 ధర పలికింది. 3 ట్రాలీల పాత విడి పత్తి విక్రయానికి రాగా రూ.6,000 నుంచి రూ.7,500 దాకా వ్యాపారులు ఖరీదు చేశారు. బస్తాల కొత్తపత్తికి రూ.5,000 నుంచి రూ.6,600 ధర పలికింది. మార్కెట్ కార్యదర్శి ఆర్.మల్లేశం బిడ్డింగ్‌ను పరిశీలించారు. అధిక తేమశాతంతో పత్తి ధర తక్కువ పలుకుతుందని ఆయన తెలిపారు.

ఎస్సారెస్పీకి 8 వేల క్యూసెక్కుల వరద

జగిత్యాల వ్యవసాయం : శ్రీరామసాగర్‌కు ఎగువ నుంచి 8525 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులు, 80.501 టీఎంసీల నీరు నిలువ ఉండగా, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మీ కాలువకు 150, సరస్వతీ కాలువలకు 500, గుత్పకు 135 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం వరద ఎక్కువగా రాకపోవడంతో గేట్లను మూసివేశారు.

క్రిప్టో మాయ!

లాభాలు వస్తాయని జనం పెట్టుబడులు ◆ కొన్ని యాప్‌లు మూసివేస్తున్నా మారని తీరు

న్యూస్‌టుడే, మేడిపల్లి



రూ.వేలల్లో పెట్టుబడులు పెడితే డాలర్లలో సంపాదన ఉంటుందన్న ఆశ సామాన్య, మధ్యతరగతి వారిని ఆకర్షిస్తోంది. క్రిప్టో కరెన్సీ పేరిట ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కొనసాగుతున్న మార్కెటింగ్ వ్యాపారంలో పెద్దఎత్తున పెట్టుబడులు పెడుతున్నారు. నిర్మల్ జిల్లాలో క్రిప్టోకరెన్సీ ఏజెంట్లపై కేసులు నమోదు కావడంతో ఆన్‌లైన్ పెట్టుబడులు తిరిగి వస్తాయా అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. తమకు లాభాలు వచ్చాయని కొందరు చెబుతుంటే.. చాలా మంది నష్టపోయారని జరుగుతున్న ప్రచారం మధ్య పెట్టుబడిదారులు అయోమయంలో ఉన్నారు. పదుల సంఖ్యలో యాప్‌ల ద్వారా వ్యాపారం జరగడం... ఇందులో కొన్ని మూతబడినట్లు చెబుతుండటంతో ఏది నిజమో, ఏది అబద్ధమో తెలియని పరిస్థితి నెలకొంది.

■ కోరుట్లలో హార్వెస్టర్‌లు రెండూ అమ్మేసి ఓ వ్యక్తి పెట్టుబడి పెట్టాడు. వాటి రికవరీ కోసం మరి కొంతమందిని చైన్ లింకింగ్‌లో చేర్పించేందుకు తీవ్రంగా యత్నిస్తున్నాడు.

■ పెగడపల్లి మండలంలోని ఓ గ్రామంలో పేద, మధ్యతరగతి, ఉన్నత వర్గాలు తేడా లేకుండా ఇంటింటికీ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

■ కోరుట్లలోనే ఓ వ్యాపారి రూ.కోటికి పైగా పెట్టుబడి పెట్టినట్లు ప్రచారం జరుగుతుండగా కొద్దిశాతం తిరిగి వచ్చినట్లు చెబుతున్నారు.

■ మేడిపల్లి మండలంలోని రెండు మూడు గ్రామాల్లో ఈ తరహా పెట్టుబడులు పెద్దఎత్తున పెట్టగా కొందరు దేశ, విదేశాల ట్రిప్పులు తిరిగినట్లు ప్రచారం జరుగుతోంది.

■ తాము పెట్టుబడి పెట్టిన యాప్ ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో ఇటీవల జగిత్యాలకు చెందిన ఓ ఏజెంట్ వద్దకు పలువురు పరుగులు తీశారు. తాను కూడా మోసపోయానని ఏజెంట్ చెప్పినా బాధితులు వినకపోవడంతో గొడవ జరిగినట్లు తెలిసింది.

■ జగిత్యాల జిల్లా కోరుట్ల, మల్యాల, పెగడపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి ప్రాంతాల్లో ఎక్కువ పెట్టుబడులు పెట్టినట్లు తెలుస్తోంది.

సార్లు... స్టార్లు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులు, ఉద్యోగులు కూడా బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ ఏజెంట్లుగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిర్మల్ జిల్లాలో పలువురు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్టు చేయగా ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన ఉపాధ్యాయుల పాత్ర పైనా చర్చ జరుగుతోంది. ఆయా జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు, వివిధ శాఖల ఉద్యోగులు ఇటీవల విదేశాలకు వెళ్లినట్లు తెలిసింది. ఉద్యోగులు ఇతర దేశాలకు వెళ్లాలంటే శాఖాపరమైన అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ పలువురు నిబంధనలకు వ్యతిరేకంగా విదేశాలకు వెళ్లడంపై ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలో పదుల సంఖ్యలో ఉపాధ్యాయులు ఈ వ్యవహారంలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు ప్రచారం జరుగుతోంది. బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ చైన్‌లింకింగ్ విస్తరించిన కొద్దీ 3 స్టార్, 5 స్టార్, 7 స్టార్... ఇలా గుర్తింపు ఇస్తారు. పలువురు సార్లు స్టార్లుగా ఎదిగే ప్రయత్నంలో నిబంధనలు పాటించలేదని తెలుస్తోంది.



రియల్.. ఢమాల్

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ముఖ్యంగా జగిత్యాల జిల్లాలో భూములకు సంబంధించిన లావాదేవీలపై క్రిప్టో కరెన్సీ ప్రభావం పడింది. పొరుగునే ఉన్న ఆర్మూరు, నిర్మల్, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో చైన్ లింకింగ్ కొనసాగుతుండటం, అధిక వడ్డీ ఆశించి పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టడంతో రిజిస్ట్రేషన్లు తగ్గిపోయాయి. 8 నుంచి 12 నెలలుగా బిట్‌కాయిన్, క్రిప్టోకరెన్సీ పేరిట అమాయకులను పలువురు ఆకర్షించడంతో సామాన్యులు కూడా పెట్టుబడులు పెడుతున్నారు. కొన్ని కరెన్సీలకు ఆన్‌లైన్‌లో అనుమతులు ఉండటంతో అవి తిరిగి వస్తాయా లేదా అని తెలియకున్నా చాలా మంది పెట్టుబడులు పెట్టారు. చాలా మంది భూములు తనఖా పెట్టి, అప్పులు తెచ్చి చైన్‌లింకింగ్‌లో చేరారు. గతంలో క్యూనెట్ పేరిట మోసపోయినా ఈ విడత పలు యాప్‌ల్లో పెట్టుబడులు పెట్టి కొందరు మోసపోగా మరికొందరు తమ పెట్టుబడి తిరిగి వస్తుందా లేదా అనే మీమాంసలో ఉన్నారు. రూ.లక్ష నుంచి పెట్టుబడులు పెట్టిన వారికి నెలకు కొంత మొత్తంలో రిటర్న్స్ వస్తుండటంతో చాలా మంది పెట్టుబడుల కోసం ఎగబడ్డారు. లాభాల ఆశతో రూ.50 లక్షల నుంచి రూ.కోటి వరకు పెట్టుబడి పెట్టిన వారూ ఉన్నారని ప్రచారం జరుగుతుండటం విశేషంగా చెప్పుకుంటున్నారు. కొన్ని నెలలు సజావుగా లావాదీవీలు జరిగినా సంబంధిత యాప్ ఆన్‌లైన్‌లో కనిపించని సందర్భాల్లో లబోదిబోమంటున్నారు. కేవలం జగిత్యాల జిల్లాలో రూ.800 నుంచి రూ.1,000 కోట్ల వరకు క్రిప్టోకరెన్సీలో పెట్టుబడులు పెట్టినట్లు ప్రచారం జరుగుతుండటం, ఇదే సమయంలో రియల్ వ్యాపారం దెబ్బతినడంతో ఊహాగానాలకు ఊతమిచ్చినట్లవుతోంది.

పేర్లు ఏవైనా... పెట్టుబడులే లక్ష్యం

ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెట్టడమే కానీ మోసం జరిగితే ఎలా ముందుకు పోవాలో తెలియకున్నా ఊళ్లకు ఊళ్లే గొలుసుకట్టులో పెట్టుబడులు పెడుతున్నారు. ఇటీవల వీఎంటీ, రెక్సోర్స్ యాప్స్ పేరిట పలువురు ఏజెంట్లు పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. రూ.లక్ష పెట్టుబడిగా పెడితే నెలకు రూ.16 వేలు వస్తాయని చెప్పడంతో పలువురు ముందుకు వచ్చారు. కొందరికి నెలనెలా రూ.16 వేల చొప్పున వచ్చాయని చెప్పడంతో నిజమో కాదో తెలియకున్నా మరింత మంది పెట్టుబడులు పెట్టారు. ఈ చైన్‌లింకింగ్‌లో కమీషన్ పెరిగిన కొద్దీ ఏజెంట్లకు స్టార్లు పెరుగుతూ వస్తాయి. 5 స్టార్ వచ్చిన వారికి రూ.2 కోట్ల వరకూ వస్తాయని చెప్పడంతో ఎక్కువ మంది పెట్టుబడుల కోసం ఎగబడుతున్నారు. చైన్ లింకింగ్‌లో టార్గెట్ చేరుకున్న ఏజెంట్లు, రూ.10 లక్షల వరకు పెట్టుబడులు పెట్టినవారు జపాన్, యూకే, సింగపూర్, బ్యాంకాక్ తదితర దేశాలు ట్రిప్పుల పేరిట తిరిగి వస్తున్నారు. దేశంలోని గోవా లాంటి పర్యాటక ప్రాంతాలకు ఒక్కో విమానాన్ని బుక్ చేస్తుండటం, వాటిల్లో ఏజెంట్లను తిప్పుతుండటం ఈ వ్యాపారంకు ఉన్న క్రేజీని తెలుపుతోంది. గతంలో చాలా మంది క్యూనెట్ ద్వారా కూడా చైన్ లింకింగ్ పేరిట పెట్టుబడి పెట్టి మోసపోయారు. అయినా ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పెట్టుబడులు సురక్షితమో కాదో తెలియకున్నా చాలా మంది అప్పులు తెచ్చి మరీ పెట్టుబడులు పెడుతున్నారు.

భార్య దూరమై.. మద్యానికి బానిసై

ఒంటరితనంతో మేస్త్రీ ఆత్మహత్య



రాంప్రసాద్

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: నాలుగేళ్ల కిందట పెళ్లయింది.. సంతానం లేదు.. రెండు నెలల కిందట జ్వరం బారిన పడి భార్య మృతి చెందింది.. ఒంటరితనం భరించలేక అప్పటి నుంచి మద్యానికి బానిసయ్యాడు.. చివరికి జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు.. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ గ్రామానికి చెందిన కుర్మ రాంప్రసాద్(28), ప్రణవి దంపతులకు సంతానం లేదు. అతడు మేస్త్రీ పని చేస్తుండగా భార్యాభర్తలు అన్యోన్యంగా ఉండేవారు. రెండు నెలల కిందట ప్రణవి జ్వరం బారిన పడింది. చికిత్స పొందుతూ డెంగీ లక్షణాలతో మృతి చెందింది. భార్య మరణం రాంప్రసాద్‌ను తీవ్రంగా కుంగదీసింది. అప్పటి నుంచి మద్యానికి బానిసై బుధవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు బసంత్‌నగర్ పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

జమ్మికుంట, న్యూస్‌టుడే: కుక్కల దాడిలో ఏడుగురు గాయపడిన ఘటన జమ్మికుంట ప్రాంతంలో చోటుచేసుకుంది. బుధవారం కోరపల్లికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అక్షర ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. అదే రోజు అదే గ్రామానికి చెందిన పి.గట్టమ్మ, గండీ స్వరూపలు కుక్కల దాడిలో గాయపడ్డారు. గురువారం కోరపల్లికి చెందిన రాజశేఖర్, టి.రాజమల్లు, పొల్సాని కృతిక్‌రావు, జమ్మికుంట పుర పరిధి కొత్తపల్లికి చెందిన రమ కుక్క కాటుకు గురయ్యారు. అక్షర పెదవి వద్ద తీవ్రగాయం కావడంతో కుటుంబీకులు వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. రెండు రోజుల వ్యవధి కోరపల్లిలో కుక్కల దాడిలో ఏడుగురు గాయపడటంతో గ్రామస్థులు పంచాయతీ భవనం వద్ద ఆందోళన చేపట్టారు. గ్రామంలో పిచ్చికుక్కలను చంపేయాలని డిమాండ్ చేశారు. గతంలో అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. కుక్కల తీవ్రతపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించానని.. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటానని గ్రామ పంచాయతీ కార్యదర్శి తారకరామారావు తెలిపారు.

వీరి పరుగు ఆగదు..

సత్తా చాటిన పోలీసులు

న్యూస్‌టుడే, గోదావరిఖని

ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 21 కిలోమీటర్లు పరుగు తీయాలంటే కొంచెం కష్టమే. కానీ ఈ పోలీసులకు అది సులువు. హాఫ్ మారథాన్(21 కిలోమీటర్లు) పరుగెత్తి సత్తా చాటారు. ఇలాంటి మరెన్నో కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. రామగుండం, కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని పోలీసులు పరుగుపై దృష్టి సారించారు. ఇటీవల కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో ప్రతిభ చాటిన వీరిపై 'న్యూస్‌టుడే' కథనం.

మరిన్ని మారథాన్‌లకు హాజరవుతా..



ఏఆర్ కానిస్టేబుల్ బుర్ర వంశీ.. నిత్యం సాధన ద్వారా హాఫ్ మారథాన్‌ను సులువగా అధిగమించారు. ఇప్పటికే కొన్ని పరుగు పందెల్లో పాల్గొని తన సత్తా చాటారు. మరిన్ని పరుగు పందెలు, మారథాన్‌లకు హాజరవుతానని తెలిపారు. **- వంశీ**

నిరంతర సాధనతోనే సాధ్యం..



రామగుండం పోలీసు కమిషనరేట్ పరిధిలో ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ నలిగొండ అంజయ్య హాఫ్ మారథాన్ పూర్తి చేశారు. 21 కిలోమీటర్లను సునాయసంగా పూర్తిచేసిన అంజయ్య.. గతేడాది నిర్వహించిన మారథాన్‌లో ప్రతిభ చాటారు. పోలీసు మీట్‌లోనూ 5 కిలోమీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచారు. నిరంతరం సాధన చేయడం ద్వారా హాఫ్ మారథాన్ సులువుగా అధిగమించగలిగానని వెల్లడించారు. **- అంజయ్య**

తోటి ఉద్యోగుల స్ఫూర్తితో.. - వెంకటేశ్




పరుగు పూర్తి చేస్తాననే నమ్మకం లేనప్పటికీ. . తోటి ఉద్యోగుల స్ఫూర్తితో విజయం సాధించానని మిడిదొడ్డి వెంకటేశ్ తన అనుభవాన్ని తెలిపారు. తొలి ప్రయత్నంలోనే హాఫ్ మారథాన్ అధిగమించినట్లు రామగుండం కమిషనరేట్ పరిధి కానిస్టేబుల్ వెల్లడించారు. ఉద్యోగంలో చేరిన తరువాత పరుగుపై దృష్టి సారించలేదని.. మారథాన్‌లో పాల్గొనాలని తోటి మిత్రుల సూచన మేరకు సాధన చేశానన్నారు.

ఆత్మవిశ్వాసం పెరిగింది - శ్రీకాంత్



తొలిసారిగా కరీంనగర్‌లో నిర్వహించిన హాఫ్ మారథాన్‌లో పాల్గొని ప్రతిభను వెలికి తీశారు.. ఏఆర్ కానిస్టేబుల్ రాళ్లబండి శ్రీకాంత్. రామగుండం కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ తొలి ప్రయత్నంలోనే విజయవంతమయ్యారు. దీంతో మరింత ఆత్మస్థైర్యం పెరిగిందని, రానున్న కాలంలో మరిన్ని పోటీలకు హాజరవుతానన్నారు.

మరింత ప్రయత్నం చేస్తాను - రవి



హాఫ్ మారథాన్‌లో పాల్గొన్న కరీంనగర్ రూరల్ పోలీసు స్టేషన్ కానిస్టేబుల్ రవి.. తొలిసారి హాఫ్ మారథాన్‌లో పాల్గొని 10 కిలోమీటర్లు పూర్తిచేశారు. ఇందులో పాల్గొనడంతో తనకున్న శక్తి తెలిసిందన్నారు. ఇకపై మరింత సాధన, ప్రయత్నం చేస్తూ.. మారథాన్‌లో పాల్గొంటానన్నారు.

రాగి తీగ చోరీ కేసులో నిందితుల అరెస్టు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు దుకాణంలో రాగి తీగ చోరీకి పాల్పడిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. పెద్దపల్లి ఏసీపీ కృష్ణ గురువారం సుల్తానాబాద్ ఠాణాలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. శాస్త్రీనగర్‌లోని నరేందర్‌రెడ్డికి చెందిన దుకాణంలో సెప్టెంబరు 23న అర్ధరాత్రి దొంగలు చొరబడి 300 కిలోల రాగి తీగలు ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన గుర్రాల చిన్నభూమయ్య, పిట్టల సురేందర్, సిలివేరి శంకరయ్య, కడమండ శ్రీకాంత్, బెల్లంపల్లికి చెందిన గోషిక కార్తీక్‌లు ముఠాగా ఏర్పడి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. దొంగిలించిన 300 కిలోల రాగిని ఆటోలో బెల్లంపల్లికి తరలించి పసుపులేటి శ్రీనివాస్‌కు 250 కిలోలు అమ్మి రూ.లక్ష తీసుకొని పంచుకున్నారు. 50 కిలోల రాగిని చిన్నభూమయ్య తన వద్దే ఉంచుకున్నాడు. వ్యాపారి శ్రీనివాస్ కొనుగోలు చేసిన 250 కిలోల రాగి నుంచి 50 కిలోలను హైదరాబాద్‌కు చెందిన రాముకు విక్రయించాడు. నిందితులు సురేందర్, శంకరయ్య, శ్రీకాంత్, కార్తీక్, శ్రీనివాస్‌లను గురువారం అరెస్టు చేసి, వారి నుంచి ద్విచక్రవాహనం, 200 కిలోల రాగిని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు గుర్రాల చిన్నభూమయ్య, హైదరాబాద్‌కు చెందిన రాము పరారీలో ఉన్నారు. పిట్టల సురేందర్, సిలివేరు శంకరయ్య గతంలో మందమర్రి, మంథని, కాటారం ఠాణాల్లో నమోదైన దొంగతనం తదితర కేసుల్లో నిందితులుగా ఉన్నారు. కేసును ఛేదించిన సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్, సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అన్నను చంపిన తమ్ముడు..

జగిత్యాల గ్రామీణం, న్యూస్‌టుడే: జగిత్యాల గ్రామీణ మండలం అంతర్గాంకు చెందిన నన్నపనేని విద్యాసాగర్‌రాజును హత్య చేసిన అతని సోదరుడు విక్రమ్‌రాజును గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న ఇంటి వద్ద భూతగాదాలతో అన్నను రోకలి బండతో మోదీ తమ్ముడు హత్య చేశాడని నిందితుడి కోసం గాలించగా అంతర్గాం వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. దాచిపెట్టిన రోకలి బండను స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండుకు తరలించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. సీఐ కృష్ణారెడ్డి, ఎస్సై సదాకర్ పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలు ప్రారంభం

కరీంనగర్ విద్యావిభాగం : ఓపెన్ స్కూల్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు జిల్లాలో గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం, మధ్యాహ్నం సమయంలో జిల్లాలోని రెండు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించినట్లు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సి.హెచ్.నాగేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం జరిగిన పదో తరగతి పరీక్షకు 54 మందికిగాను 31 మంది, మధ్యాహ్నం జరిగిన ఇంటర్ పరీక్షకు 48 మందికిగాను 31 మంది హాజరయ్యారని చెప్పారు. జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావు రెండు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

(10 AM TO 1 PM) చందుర్తి: 9493188772 గంభీరావుపేట: 8008573611

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే

? ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లో వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉన్నాయి. పగటిపూట వెలగడం వల్ల విద్యుత్తు వృథా కావడంతోపాటు గ్రామ పంచాయతీకి కరెంటు బిల్లుల భారం పడే ఆస్కారముంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలి. - రమేశ్, రాచర్ల బొప్పాపూర్

✓ బదిలీపై వచ్చిన నేను ఈ నెల 2న పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు తీసుకున్నాను. సమస్య నా దృష్టికి రాలేదు. వీధి దీపాలు నిరంతరం వెలగకుండా తక్షణమే చర్యలు చేపడతాం. - సంతోష్, పంచాయతీ కార్యదర్శి, రాచర్ల బొప్పాపూర్

నేర వార్తలు

చికిత్స పొందుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి
ఎల్లారెడ్డిపేటలో విషాదం


అవినాష్

ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే: ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మకంటి అవినాష్ (28) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిపేటలో బొమ్మకంటి రమ్య, రవీందర్ దంపతుల చిన్నకుమారుడు అవినాష్ హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో గత కొంత కాలంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. జీవితంపై విరక్తితో అక్కడ తన ఇంట్లో రెండు రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే స్థానికులు ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. అయితే ప్రేమ వ్యవహారం కారణంగా బలవన్మరణానికి ఒడిగట్టినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు.

జూదరులపై కేసు
ముస్తాబాద్, న్యూస్‌టుడే: ముస్తాబాద్ శివారులోని లింగంకుంట వద్ద జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు ఎస్సై గణేశ్ గురువారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు వెళ్లి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.7,800 నగదు, రెండు చరవాణులు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

యువకుడి ఆత్మహత్య
గంభీరావుపేట, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గంభీరావుపేట మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... శనిగారం శంకర్‌కు ఒక కొడుకు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేస్తూ కుటుంబ జీవిస్తున్నారు. కొడుకు జీవన్(31) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ముస్తాబాద్, హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రుల్లో చూపించినప్పటికీ మధుమేహ వ్యాధి తగ్గటం లేదు. ఈక్రమంలో గురువారం ఉదయం స్నానం చేసి టీ తాగి బయటకు వెళ్లాడు. ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి కుటుంబీకులు వెతికారు. తాళ్ల ఎల్లమ్మ ఆలయం వద్ద బీడు భూమిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత
రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలోని విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని సెస్ ఏఈ కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం
రుద్రంగి, న్యూస్‌టుడే: రుద్రంగి మండల కేంద్రంలో ప్రహ్లాద పర్వతంపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు మీనయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ ఎన్.ప్రేమలత ఆదేశాల మేరకు విశ్రాంత ఉద్యోగుల భవనంలో విశ్రాంత ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైద్యులు విశ్రాంత ఉద్యోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జైల్ సింగ్, రమేశ్, యాదగిరిగౌడ్, ఏజీపీ కీసరి శ్రీనివాస్, న్యాయవాదులు ఆడెపు వేణు, మల్లేశ్‌యాదవ్, లోక్ అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

దుబాయి వెళ్లేవారికి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి
సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: దుబాయిలో డెలివరీ బాయ్స్‌కు అధిక డిమాండ్ ఉందని, దీనికి దరఖాస్తు చేసుకోవడానికి అభ్యర్థులకు తప్పనిసరిగా ఇండియన్ ద్విచక్ర వాహన డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థుల వయసు 21 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉండాలని పేర్కొన్నారు. టామ్‌కామ్ సంస్థ తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టర్ అయిందని తెలిపారు. దీని ద్వారా దుబాయిలో డెలివరీ బాయ్స్‌గా ఎంపిక కోసం ఈ నెల 5న సిరిసిల్ల బైపాస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ముఖాముఖి నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు టామ్‌కామ్ మెయిల్‌కు తమ పూర్తి వివరాలను పంపించాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440051285, 9440048500 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న వికాస్‌రావు

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో భాజపా అధికారంలోకి రావడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేములవాడ మండలంలో గురువారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతలో స్పందన బాగుందన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు సభ్యత్వ నమోదు పునాదిలా పని చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలుచుకోవాలన్నారు. సామాజిక న్యాయం, దేశ సమగ్రత భాజపాతోనే సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వం నమోదు చేసేందుకు నాయకులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకురాలు చెన్నమనేని దీప, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, బుర్ర శేఖర్, జింక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో ప్రథమం...

రెండోసారి కాయకల్ప అవార్డు సొంతం

● రాచర్ల బొప్పాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ఆదర్శం

న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట

ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. గ్రామీణుల ఆరోగ్యం విషయంలో వైద్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో 2022 జులైలో తొలిసారి కాయకల్ప అవార్డును పొందగా ఈ ఏడాది కూడా ప్రతిష్ఠాత్మక కాయకల్ప అవార్డును రెండోసారి సొంతం చేసుకుంది. అవార్డు కింద ప్రభుత్వం అందించే సుమారు రూ. 25 వేల నగదు ప్రోత్సాహకాన్ని ఆసుపత్రి నిర్వహణకు వెచ్చించనున్నారు.


రాచర్ల బొప్పాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్

రాచర్ల బొప్పాపూర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ పరిధిలో రాచర్ల బొప్పాపూర్‌తోపాటు కోరుట్లపేట గ్రామాల ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాల వసతులతో కూడిన పక్కా భవనం చుట్టూ ఆహ్లాదకర పరిస్థితులు నెలకొన్నాయి.

★ గర్భిణులు, బాలింతలు, మధుమేహం, రక్తపోటుతో బాధపడే వారికి సకాలంలో వైద్య సేవలు అందిస్తున్నారు. కొవిడ్ సమయంలో నిర్ధారణ పరీక్షలు, కొవిడ్ వ్యాక్సినేషన్ విస్తృతంగా చేపట్టారు.

★ గర్భిణులు సుఖప్రసవం పొందేందుకు వారితో కొన్ని రకాల యోగాసనాలు, వ్యాయామాలు చేయిస్తున్నారు.

★ రోగుల మానసిక ప్రశాంతతకు ధ్యానం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

★ వారంలో ఒక రోజు డ్రైడే పాటించేలా ప్రజలను ప్రోత్సహిస్తున్నారు. సీజనల్ వ్యాధుల పట్ల నిత్యం అవగాహన కల్పిస్తున్నారు.

★ ప్రతి నెలా ఆరుగురు క్షయ, 198 మంది మధుమేహ, రక్తపోటు బాధితులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నారు.

బాధ్యత పెరిగింది



రాచర్ల బొప్పాపూర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌కి రెండోసారి కాయకల్ప అవార్డు దక్కడం సంతోషంగా ఉంది. ఈ అవార్డుతో మాపై బాధ్యత మరింత పెరిగింది. ముందుముందు మరిన్ని అవార్డులు పొందేందుకు శాయశక్తులా కృషి చేస్తాం. ప్రభుత్వం తరఫున మరిన్ని సౌకర్యాలు మెరుగుపడితే అన్ని రకాల వైద్య సేవలు పేదలకు అందుతాయి. సిబ్బంది మెరుగైన పనితీరుతోపాటు ఆసుపత్రి తరఫున నిర్వహించే కార్యక్రమాల్లో రాచర్ల బొప్పాపూర్, కోరుట్లపేట గ్రామస్థుల ప్రోత్సాహం ఎంతో ఉంది. ఉన్నతాధికారుల సలహాలు, సూచనలు విధిగా పాటిస్తున్నాం. ముందుముందు మరిన్ని అవార్డులు సాధించేందుకు కృషి చేస్తాం.

- స్రవంతి, మండల వైద్యాధికారిణి, ఎల్లారెడ్డిపేట


రుద్రంగిలో దుర్గాదేవికి పూజలు


సిరిసిల్ల: అమ్మవారిని తీసుకొస్తున్న భక్తులు


వెంకంపేటలో...


గుండన్నపల్లిలో ...

శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

జిల్లాలో గురువారం శరన్నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. డప్పుచప్పుళ్లతో యువతీ యువకుల నృత్యాల మధ్య అమ్మవారి శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించారు. యువకులు భవాని దీక్షలను తీసుకున్నారు.

- న్యూస్‌టుడే బృందం


గంభీరావుపేటలో...


రాచర్ల బొప్పాపూర్‌లో...


చందుర్తిలో ...


కొలనూర్‌లో ఊరేగింపు...


ఎల్లారెడ్డిపేటలో...


ముస్తాబాద్‌లో...


కంచర్లలో భక్తుల పూజలు

క్రీడలతో మానసికోల్లాసం


పరుగు పోటీలను ప్రారంభిస్తున్న కమాండెంట్ శ్రీనివాస్‌రావు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని 17వ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణ పరిధిలోని సర్దాపూర్ 17వ బెటాలియన్‌లో అడిషనల్ డీజీపీ సంజయ్‌కుమార్ జైన్ ఆదేశాల మేరకు బెటాలియన్ ఇంటర్ కంపెనీస్ క్రీడా పోటీలను ఏర్పాటు చేశారు. వీటిని ఆయన ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీస్ సిబ్బంది తీరిక లేకుండా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. పోలీస్ సిబ్బంది మానసికోల్లాసం కోసం ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలు ఈ నెల 6 వరకు కొనసాగుతాయన్నారు. అథ్లెటిక్స్, ఇండోర్ గేమ్స్‌తోపాటు, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు సాంబశివరావు, రాందాస్, ఉదయ భాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రమీల, ఆర్ఐలు నారాయణ, శ్రీధర్, శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెటూరులో విరబూసిన విద్యాసుమం
అక్కపల్లి విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు


మాధవ్

అక్కపల్లి(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే: మారుమూల పల్లెటూరిలో విద్యాసుమం విరబూసింది. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపల్లికి చెందిన విద్యార్థి రాపోలు మాధవ్ సింగరేణి వైద్య కళాశాలలో ఉచిత ఎంబీబీఎస్ సీటు సాధించడం ద్వారా నేటి యువతరానికి ఆదర్శంగా నిలిచాడు. రాపోలు శారద, నాగరాజు దంపతులకు కుమారుడు మాధవ్, కుమార్తె మాన్యతశ్రీ ఉన్నారు. నాగరాజు డీఆర్డీఏలో హెచ్ఆర్ మేనేజర్‌గా పని చేస్తుండగా, శారద సిరిసిల్లలోని కేజీబీవీలో సీఆర్టీగా కొనసాగుతున్నారు. ఇటీవల వెలువడిన ఎన్ఈఈటీ పరీక్షల్లో 570 మార్కులు పొంది ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించాడు.

భారాస మహిళా నేతల నిరసన


సిరిసిల్లలో ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: భారాస వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై రాష్ట్ర మంత్రి కొండా సురేఖ చేసిన నిరాధారణమైన వ్యాఖ్యలను నిరసిస్తూ గురువారం సిరిసిల్ల పట్టణంలోని గాంధీ చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారాస మహిళా నాయకులు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మంత్రి చిత్రపటాన్ని దహనం చేసేందుకు మహిళా నాయకులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ జిందం కళ, భారాస పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు బత్తుల వనజ, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలు నవీకరణకు ఆదేశం
సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వివరాలను రోజూ నవీకరించాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, పెండింగ్, పరిష్కారం తదితర అంశాలపై సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, ఆర్ఐలు, నీటిపారుదలశాఖ ఏఈలు తమ పరిధిలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసిన భూములపై క్షుణ్ణంగా పరిశీలించాలని తర్వాతే యాప్‌లో నమోదు చేయాలన్నారు. రోజూ తమ పరిధిలో ఎన్ని దరఖాస్తులు పరిష్కరించారో తనకు వివరాలు పంపించాలని డీపీవోను ఆదేశించారు. జిల్లాలో మొత్తం 42,491 దరఖాస్తులు రాగా, ఇంకా 36,200 పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఆయా దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈ సమావేశంలో ఇన్‌ఛార్జి డీపీవో శేషాద్రి, డీఎల్‌పీవో గీత, డీటీసీపీవో అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

హంస వాహనంపై స్వామివార్ల ఊరేగింపు
వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవీ నవరాత్రోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామివార్లను హంస వాహనంపై ఊరేగించారు. శైలపుత్రి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరాజరాజేశ్వరస్వామి, శ్రీ లక్ష్మీ సమేత అనంత పద్మనాభస్వామివార్ల ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి పెద్ద సేవపై ప్రతిష్ఠించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివార్లను పట్టణంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు స్వామివార్లను దర్శించుకొని తరించారు. భాజపా జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవో శ్రీనివాస్, డీఈ మహిపాల్‌రెడ్డి, భారాస నాయకుడు మనోహర్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా ఆవిర్భావ వేడుకలు


సిరిసిల్లలో కేకు కోస్తున్న జేఏసీ నాయకులు

సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలోని గాంధీచౌక్ వద్ద జిల్లా ఆవిర్భావ వేడుకలను అప్పటి జిల్లా ఉద్యమ జేఏసీ నాయకులు నిర్వహించారు. గురువారం కేకు కోశారు. ఈ సందర్భంగా ఉద్యమ జేఏసీ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత నూతన జిల్లాగా సిరిసిల్లను ఏర్పాటు చేయాలని ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్నామన్నారు. జేఏసీ నాయకులపై అప్పటి భారాస ప్రభుత్వం ఎన్నో కేసులు పెట్టిందని, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆ కేసులను ఎత్తివేసే విధంగా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు బుస్స వేణు, సంగీతం శ్రీనివాస్, కంసాల మల్లేశం, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్, వనిత, ఆకుల బాలరాజు, రాగుల రాములు, చొక్కాల రాము, లింగంపల్లి మధుకర్, దశరథం, ఎం.డి సత్తార్, బైరినేని రాము తదితరులు పాల్గొన్నారు.

వేములవాడలో డిజిటల్ సర్వే ప్రారంభం


వేములవాడ 19వ వార్డులో వివరాలు సేకరిస్తున్న అధికారులు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని 19వ వార్డులో గురువారం అధికారులు కుటుంబ డిజిటల్ సర్వేను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. ఈ వార్డులో దాదాపు 220 కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాలను పూర్తిస్థాయిలో సర్వే చేసి వివరాలు నమోదు చేయనున్నారు. డిజిటల్ సర్వేను ఆర్డీవో రాజేశ్వర్ పరిశీలించారు.

వేములవాడ గ్రామీణం: వేములవాడ గ్రామీణ మండలం బొల్లారంలో డిజిటల్ కార్డుల సర్వేను గురువారం ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించిన అధికారుల బృందం ఇంటి యజమానురాలితోపాటు కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుజాత, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ పాల్గొన్నారు.


ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


వేములవాడ: కోలాటం ఆడుతూ...

బతుకమ్మ వేడుకల

జిల్లాలో బతుకమ్మ వేడుకలను రెండో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చారు. ఇళ్ల నుంచి ప్రధాన కూడళ్లకు చేరుకొని బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. అనంతరం సమీపంలోని జలవనరుల్లో నిమజ్జనం చేశారు. - న్యూస్‌టుడే యంత్రాంగం


ముంబయిలో..


ముస్తాబాద్‌లో...